సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 28 । ఆగస్టు । 2024



సింహగిరిపై వేడుకగా శ్రీకృష్ణాష్టమి

సింహగిరిపై శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. 8లో



ఫిట్ ఇండియా పోటీలకు శ్రీకారం

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. 8లో



డాబాగార్డెన్స్ : సినీ నటుడు శ్రీకాంత్ కనకమహాలక్ష్మి అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్, ఐవోసీఎల్ మధ్య ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్, ఐవోసీఎల్ ఈడీ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) మధ్య మంగళవారం హైడ్రాలిక్, లూబ్రికెంట్ ఆయిల్, గ్రీజుల సరఫరాపై ఎంవోయూ జరిగింది. స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం సమావేశ మందిరంలో 2024 నుంచి 2029 వరకు ఐదేళ్ల కాలపరిమితితో కూడిన అవగాహన ఒప్పందంపై ఇరు సంస్థల ఉన్నతాధికారులు సంతకాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ, ఐవోసీఎల్ లూబ్స్ ఈడీ ఆర్.ఉదయకుమార్ స్టీల్‌ప్లాంట్ సీజీఎం వర్క్స్ యు.శ్రీధర్, జీఎం సోమరాజు, ఐవోసీఎల్ సీజీఎం ఆర్.సుందర నారాయణన్, జీఎంలు ఎన్‌వీఎస్ మూర్తి, జయశంకర్‌ల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అవసరాలను తీర్చడానికి లూబ్రికెంట్లను అభివృద్ధి చేసిన ఐవోసీఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐవోసీఎల్ ఈడీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందాన్ని మైల్ స్టోన్ డేగా అభివర్ణించారు.

ఏఎంసీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రారంభం



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)లో 2024–25 సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొత్తం 250 సీట్లలో 37 సీట్ల భర్తీకి అఖిల భారత కోటాలో మంగళవారం మొదటి విడత కౌన్సెలింగ్ చేపట్టారు. నెల్లూరుకు చెందిన కండే శ్రీకర్ (3336), శ్రీకాకుళానికి చెందిన యు.మోహన్ కృష్ణ (4020), విశాఖపట్నం ప్రాంతానికి చెందిన యశశ్రీ (6091), ఎస్టీ కేటగిరీలో 63,527 ర్యాంక్ సాధించిన శ్రీకాకుళానికి చెందిన ఎస్.హితశ్రీ తొలిరోజు ప్రవేశం పొందారు. ఈ నెల 29వ తేదీలోగా అఖిల భారత కోటా సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు. మిగిలిన 85 శాతం సీట్లను రాష్ట్ర కోటా కింద డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ భర్తీ చేస్తుందన్నారు. కొత్తగా చేరిన యూజీ విద్యార్థులకు ప్రిన్సిపాల్, యూజీ అడ్మిషన్ల నోడల్ అధికారి డాక్టర్ ఎ.కృష్ణవేణి స్వాగతం పలికారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక రేపు

మహారాణిపేట: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో మధ్యాహ్నం 12.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేవల్ బేస్‌కు వెళ్తారు. 12.45 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు నేవల్ బేస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని మధ్యాహ్నం 3.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో తిరువనంతపురం వెళ్తారు.

నేడు మంత్రి లోకేష్ రాక

మహారాణిపేట: మంత్రి నారా లోకేష్ బుధవారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో రాత్రి 9.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రామ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయానికి చేరుకొని అక్కడ బస చేస్తారు. 29న ఉదయం 9.45 గంటలకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6.30 గంటలకు నొవాటెల్ హోటల్‌కు వెళ్తారు. రాత్రి 9 గంటలకు రామ్‌నగర్ ఎన్టీఆర్ భవన్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు.

ఏయూలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి చర్యలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో బోధన పటిష్టతకు అవసరమైన గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. టీచింగ్ కొరత లేకుండా చూస్తామని, ఎక్కడా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఆపిన గెస్ట్ ఫ్యాకల్టీలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. సెమిస్టర్‌కు వారికి ఇచ్చే పారితోషకాన్ని కూడా అన్ని కళాశాలలకు సమానంగా పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.



మార్చురీ పరిసరాల్లో సీసీ కెమెరాలు అవసరం

కేజీహెచ్ మార్చురీ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు పోలీసులతో భద్రత కల్పించాలి. మార్చురీ వద్ద భద్రత కోసం ఒక ఉద్యోగి ఉంటాడు. ఆయనొక్కడే ఎంత వరకు చూడగలడు. రాత్రి సమయంలో మద్యం, గంజాయి సేవించే వారి సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిలో మహిళా ఉద్యోగులు, వైద్యులు పని చేయడం ఇబ్బందిగా ఉంది. ఒక్కొక్క సందర్భంలో మృతుల బంధువుల నుంచి కూడా ఇబ్బందులు తలెత్తుతుంటాయి.

– డాక్టర్ కరణం మమత, ప్రొఫెసర్, ఫోరెన్సిక్ విభాగాధిపతి, ఏఎంసీ



రిజర్వేషన్ల కంటే భద్రత ముఖ్యం

ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, మహిళా ఉద్యోగులకు భద్రత లేదు. అవుట్ పోస్టులో ఒకే కానిస్టేబుల్ ఉంటారు. అతన్ని కేవలం మెడికో లీగల్ కేసులు(ఎంఎల్‌సీ) నమోదు కోసం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో రోగుల బంధువులు ఎప్పుడైనా గొడవలకు దిగినా.. ఆ కానిస్టేబుల్ పట్టించుకునే పరిస్థితులు ఉండవు. కోల్‌కతాలో వైద్యురాలిపై దాడి అమానుషం. చదువుల కోసం దూర ప్రాంతాలకు పంపుతున్న తల్లిదండ్రులకు ఇలాంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్లు కంటే మహిళా భద్రత ముఖ్యం.

– డాక్టర్ డి.లక్ష్మీతులసి, గైనిక్ వైద్యురాలు, విశ్రాంత ఆర్ఎంవో, కేజీహెచ్

ఆస్తులపై పిడుగు!



- త్వరలో మార్కెట్ విలువ సవరణకు సన్నాహాలు
- రహస్యంగా భూముల విలువ పెంపునకు కసరత్తు
- ప్రాంతాలను బట్టి 20 నుంచి 50 శాతం పెంచాలని ఆలోచన
- ఆదాయ పెంపు కోసం క్రయవిక్రయదారులపై భారం

విశాఖ సిటీ : భూముల క్రయ విక్రయదారులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటకముందే కుటిల బుద్ధి చూపించనుంది. ప్రభుత్వ ఖజానాను నింపుకోడానికి రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచాలని ఆలోచన చేస్తోంది. ఇందుకోసం భూముల మార్కెట్ విలువ సవరణపై నివేదిక తయారు చేయాలని ప్రభుత్వ పెద్దలు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఆ దిశగా జిల్లాలో రిజిస్ట్రేషన్ అధికారులు అప్పుడే రహస్యంగా కసరత్తు ప్రారంభించారు. రెవెన్యూ రాబడి కోసం క్షేత్ర స్థాయిలో మార్కెట్ ధరలపై స్థానిక సంస్థల అధికారులతో కలిసి విలువ ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వం తొలి షాక్



ఎన్నికలకు ముందు కూటమి నేతలు రిజిస్ట్రేషన్, విద్యుత్, ఆర్టీసీ ఇలా పలు శాఖల్లో ఛార్జీల పెంపు ప్రసక్తే ఉండదని బాకాలు ఊదారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజల నడ్డి విరిచి భారీగా ఆదాయాన్ని పిండుకోవాలని భావిస్తున్నారు. అధికారం చేపట్టి మూడు నెలల్లోనే ఇళ్లు, భూముల క్రయ విక్రయదారులకు తొలి షాక్ ఇవ్వడానికి సమాయత్తమవుతున్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయిందని, ఆదాయం పెంపు నెపంతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచాలని ఆలోచన చేస్తోంది. 2014 నుంచి 2019 మధ్య నాలుగు సార్లు భూముల విలువ సవరణ చేస్తే.. 2019–2024 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రెండు సార్లు మాత్రమే ధరలు పెంచారు. కోవిడ్ కష్ట కాలంలో రాష్ట్ర ఖజానాకు రూపాయి ఆదాయం రాని సమయంలో కూడా రిజిస్ట్రేషన్ ధరలు పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయం కోసం మళ్లీ ప్రజల నడ్డి విరవాలని చూస్తోంది.

విశాఖే ఆశాకిరణం

రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయానికి విశాఖ ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్ర ఆదాయంలో 10 శాతం జిల్లాలో రిజిస్ట్రేషన్స్ ద్వారా సమకూరుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏటా భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.500 కోట్లు నుంచి రూ.600 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. 2023–2024లో రూ.731.69 కోట్ల లక్ష్యానికి గాను రూ.504.82 కోట్లు ఆదాయం సమకూరింది. తరువాత ఎన్నికల ఏడాది కావడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. దీంతో ఈ ఏడాది రూ.600 కోట్లు దాటలేదు. అయితే భారీగా భూముల విలువ పెంచడం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా ప్రభుత్వం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసింది.

10 నుంచి 50 శాతం వరకు..



ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో రిజిస్ట్రేషన్ అధికారులు భూముల మార్కెట్ విలువ సవరణకు అంచనాలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. వాస్తవానికి భూముల మార్కెట్ విలువ సవరణ విషయంలో శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో భారీగా భూములు విలువ పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూముల విలువలో కూడా భారీగా వ్యత్యాసం ఉండే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇక కమర్షియల్‌లోకి వచ్చే భూముల ధరలు 50 శాతానికి పైగా పెంచాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారులు, ఇతర రహదారుల పక్కనున్న భూముల విలువ రెట్టింపయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కనిష్టంగా 10 శాతం నుంచి గరిష్టంగా 50 శాతం వరకు విలువ పెంచనున్నట్లు టాక్ వినిస్తోంది.

కూటమికి మేలు చేసేలా సవరణ



ఈ ప్రతిపాదనల్లో కూటమి నేతలకు మేలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఏటా ఆగస్టులో భూముల మార్కెట్ విలువ సవరణలు చేస్తుంటారు. ఇప్పటికే విశాఖలో భూముల విలువ విపరీతంగా ఉండడంతో గత ప్రభుత్వం 2023లో ధరలు సవరించింది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కూడా ధరల సవరణకు సిద్ధమవుతోంది. ఇందులో కూటమి నేతల కోసం కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు స్వల్పంగా పెంచే విధంగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కూటమి నేతలు కొనుగోలు చేసే ప్రాంతంలో ధరలు పెంచకుండా.. ప్రస్తుతం వారి భూములు ఉన్న చోట భారీగా పెంచే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి పంపించే పనిలో రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కనెక్షన్ కావాలనుకునే వారికి పూర్తి సహకారం అందించాలని చెప్పారు. స్థానిక సంస్థల సహకారంతో జిల్లాలో ఒక ఆదర్శ సోలార్ గ్రామాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. వినియోగదారుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటుతో పాటు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ప్రయోజనాలు.. రాయితీలు

విద్యుత్ శాఖ ఎస్.ఈ జి.శ్యాంబాబు పీఎం సూర్యఘర్ యోజన పథకం వివరాలను వెల్లడించారు. ఒక కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.60,000 (రాయితీ రూ.30,000), 2 కేడబ్ల్యూపీకి రూ.1,20,000 (రాయితీ రూ. 60,000), 3 కేడబ్ల్యూపీకి రూ.1,80,000 (రాయితీ రూ.78,000) అవుతుందని తెలిపారు. ఇంటి పైకప్పు పైన కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సౌరశక్తి కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు www.pmsuryaghar.gov.in/APEPDCLPMSURYAGHAR పోర్టల్‌లో లాగిన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా సోలార్ కాంట్రాక్టర్‌ను వినియోగదారులే ఎంచుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం 5 కేడబ్ల్యూపీ వరకు రూ.1180, 5 కేడబ్ల్యూపీ దాటిన వారికి రూ.5900 చెల్లించాలన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1912లో సంప్రదించవచ్చని సూచించారు. జెడ్పీ సీఈవో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టండి

మంత్రి నారాయణ ఆదేశం



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

విశాఖ సిటీ: ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో భవన అనుమతులు, రోడ్ల విస్తరణ పనులు, జీవీఎంసీ ఆస్తుల రక్షణ, వెండింగ్, హాకర్ జోన్లు, ఆక్రమణలు, పార్కింగ్, ప్రకటనల ఫీజులు, లేఅవుట్ల అనుమతులు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, అనధికార నిర్మాణాలు, నగర రోడ్లు తదితర అంశాలపై చర్చించారు. జీవీఎంసీలో పీపీపీ పద్ధతిలో చేపడుతున్న పలు ప్రాజెక్టులను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ మీడియన్‌లో ఉన్న ప్రకటన బోర్డులను తొలగించాలని, గ్రీనరీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. బిల్డింగ్ ప్లాన్ల మంజూరులో ఎందుకు జాప్యం జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. వాటిని వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. అలాగే మాస్టర్ ప్లాన్, ఫ్లై ఓవర్లు, ఓపెన్ డ్రైయిన్లు, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. నాలుగు నెలల్లో అన్ని పనులపై ప్రత్యేక దృష్టి సారించి.. ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటాం

పీఎంపాలెం: పార్కులు, ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలు తొలగించి, ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి పి.నారాయణ అన్నారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ప్రభుత్వ భూములను అప్పగించాలన్నారు. వేస్ట్ టు విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్ట్‌ను ఆధునికీకరించి మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో వేస్ట్ టు విద్యుత్ ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందన్నారు. చైనా, జపాన్, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో దుర్వాసన వెలువడకుండా భవంతుల మధ్యలో డంపింగ్ యార్డులు ఉన్నాయని.. ఇక్కడి కూడా ఆ విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రుషికొండ భవనాలను వినియోగిస్తామన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపులో తెలంగాణ ప్రభుత్వం(హైడ్రా) అనుసరిస్తున్న విధానాలను ఇక్కడ కూడా అమలు చేస్తామన్నారు. అనంతరం డంపింగ్ యార్డు ప్రాంగణంలో మంత్రి మొక్క నాటారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘కూటమి’ విధ్వంసకాండ

- అక్కయ్యపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- వాట్సాప్‌లో స్టేటస్‌లు పెట్టుకుని టీడీపీ నేతలు పైశాచిక ఆనందం
- వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం
- సెప్టెంబర్ 2లోగా యథాస్థానంలో పెట్టాలని డిమాండ్



కూటమి నేతలు వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్న ఫొటో

సీతంపేట/సీతమ్మధార: రాష్ట్రంలో అధికారం అండగా చూసుకుని ప్రశాంత నగరంలో కూటమి నాయకుల విధ్వంసాలు కొనసాగుతున్నాయి. అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసి మాయం చేశారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం తొలగించాలంటూ కూటమి నాయకులు సోమవారం ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారు చూస్తే సిమెంట్ దిమ్మ విరగ్గొట్టి మహానేత విగ్రహాన్ని అక్కడి నుంచి మాయం చేశారు. పైగా కూటమి నాయకులు నిన్న నేడు అంటూ విగ్రహం ఉన్నప్పుడు, విగ్రహం ధ్వంసం చేసిన తర్వాత ఫొటోలను తమ వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి విశేష కృషి చేసి.. ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేయడంపై ఆయన అభిమానులు, నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రాజు, బర్కత్ అలీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కూటమి నాయకుల దుశ్చర్యను ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. సెప్టెంబర్ 2వ తేదీ మహానేత వైఎస్సార్ వర్ధంతి నాటికి విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి నేతలు దుశ్చర్యకు పాల్పడ్డారని, ప్రశాంత విశాఖలో మునుపెన్నడూ లేని సంస్కృతికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమ కార్యకర్తలను రౌడీయిజం చేయమని చెప్పారా అని ప్రశ్నించారు. పగవాడికి కూడా మేలు చేసిన వ్యక్తి రాజశేఖర రెడ్డి అని, అటువంటి మహానాయకుడి విగ్రహం ధ్వంసం చేసి కూటమి నాయకులు ఇంకా దిగజారిపోయారన్నారు. డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడుతూ కూటమి నేతలు సమావేశమై వైఎస్సార్ విగ్రహం తొలగించాలని మాట్లాడుకోవడం, తెల్లవారే సరికి ధ్వంసం చేయడం దారుణమన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశామని.. ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడలేదన్నారు.



సీఐ విజయకుమార్‌కి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పోలీసులకు ఫిర్యాదు

ఈ ఘటనపై పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణకుమారి మంగళవారం ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి.. సీఐ ఎస్.విజయకుమార్‌కి ఫిర్యాదు చేశారు. అక్కయ్యపాలెం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఈ నెల 26న కూటమి పార్టీల ఆధ్వర్యంలో సమావేశం జరిగిందని, అదే రోజు అర్ధరాత్రి సమయంలో విగ్రహం ధ్వంసం చేసి మాయం చేశారని అందులో పేర్కొన్నారు. 46వ వార్డుకి చెందిన కొండా ప్రసాద్, అతని అనుచరులు ఈ విగ్రహాన్ని ధ్వంసం చేస్తామని ముందుగానే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంటీబీఈ.. బీ అలెర్ట్!



- ఎసైన్షియాలో ప్రమాదానికి మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ లీకేజీ కారణం
- ఎంటీబీఈ తయారీ పరిశ్రమల్లో భయాందోళనలు
- మాక్ డ్రిల్ నిర్వహణకు ఎంటీబీఈ తయారీ పరిశ్రమలు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం : ఫార్మా పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటైన పరవాడ ఫార్మాసిటీతో పాటు అచ్యుతాపురం సెజ్‌లో కలిపి 200కి పైచిలుకు ఫార్మా పరిశ్రమలున్నాయి. వీటిలో సుమారు 50 వేల మంది పనిచేస్తున్నారు. మండే స్వభావం గల సంస్థల్లో అధికారులు తనిఖీలు సరిగ్గా చేపట్టకపోవడంతో భద్రతా ప్రమాణాలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఔషధ ఉత్పత్తుల తయారీలో కీలక యంత్రాలైన రియాక్టర్లు ఒత్తిడికి గురై పేలుడు సంభవిస్తే, ఆ ప్రమాద తీవ్రత భయంకరంగా ఉంటుంది. పేలుడు ధాటికి అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న రసాయనాలు బయటకు చిమ్మడం, దట్టమైన పొగలు, మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న వారు అగ్నికీలల్లో కాలిపోయో, శ్వాస ఆడకనో మృత్యుఒడికి చేరుతున్నారు. వీరిపై ఆధారపడ్డ కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయి.


పలు పరిశ్రమల్లో ఎంటీబీఈ

ఎసైన్షియాతో పాటు సెజ్‌లోని పలు పరిశ్రమలు ఎంటీబీఈని తయారు చేస్తున్నాయి. దీంతో ఆయా పరిశ్రమల్లోని ఫార్మా ఉద్యోగులు, కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. తయారీ బ్లాక్‌లోనే కాదు ఆ కంపెనీకి వెళ్లాలన్నా జంకుతున్నారు. ఆ పరిశ్రమలో ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైంది. ఎసైన్షియా ప్రమాద ప్రభావం మిగతా ఫార్మా పరిశ్రమలపై పడింది. కొందరు ఉద్యోగులు, కార్మికులు వివిధ కారణాల పేరుతో సెలవులు పెడుతున్నారు. దీంతో ఫార్మా ఉత్పత్తులు మందగించినట్లు తెలుస్తోంది.

మాక్ డ్రిల్‌కు సన్నాహాలు

ఉద్యోగులు, కార్మికుల సెలవుల్లో ఉండపోవడం, ఉత్పతికి విఘాతం కలగడంతో పరిశ్రమల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వారిలో భయాందోళనలు తొలగించేందుకు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాయి. ముఖ్యంగా ఎంటీబీఈ ఉత్పత్తవుతున్న పరిశ్రమలు భద్రతా ప్రమాణాలపై దృష్టిసారించాయి. తమ కంపెనీలో ఉత్పత్తవుతున్న ఎంటీబీఈ యూనిట్ పూర్తిగా సురక్షితమని.. నిర్భయంగా విధులకు హాజరవ్వొచ్చు అంటూ వారిలో ధైర్యాన్ని నూరిపోస్తున్నాయి. అదేవిధంగా ప్రమాదవశాత్తూ చిన్న చిన్న లీకేజీలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి.. దాని నుంచి ఎలా అధిగమించాలనే అంశాలపై ప్రతి కార్మికుడికీ అవగాహన ఉండేలా మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఎంటీబీఈ తయారీ ఫార్మా పరిశ్రమలు సిద్ధమవుతున్నాయి. అలాగే ఉద్యోగులు, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై శిక్షణ అందించనున్నాయి. భవిష్యత్తులో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించే వ్యవస్థను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

మిథైల్ టెర్ట్.. వెరీ డేంజర్ !



అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ (ఎంటీబీఈ) తయారు చేస్తున్నప్పుడు లీకేజీయే. ఎంటీబీఈ అంటే కర్బన సమ్మేళనం. మనం సిరప్‌లు తాగుతున్నప్పుడు వివిధ రకాల ఫ్లేవర్లు వస్తుంటాయి కదా.. ఆ ఫ్లేవర్ల కోసం ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తుంటారు. మిథనాల్, ఐసోబ్యుటీలిన్ రసాయన చర్య ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తుంటారు. అమెరికాలో రోజుకు 10 వేల బ్యారెల్స్ వరకూ దీన్ని తయారు చేస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 35 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎంటీబీఈ ఉత్పత్తవుతుంటుంది. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ఎసైన్షియాలో 500 లీటర్ల ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తున్నారు. సిరప్‌లతో పాటు పిత్తాశయంలో ఏర్పడే రాళ్లని కరిగించేందుకు వాడే మందుల్లోనూ ఎంటీబీఈని వినియోగిస్తుంటారు. ఇది ఆవిరి రూపంలో ఉత్పత్తవుతుంది. దీన్ని రియాక్టర్ల ద్వారా ద్రవరూపంలోకి మార్చుతుంటారు. ఇది రంగులేని ద్రావకం. ఎంటీబీఈలో ఆక్సిజన్ శాతం అత్యధికంగా ఉంటుంది కాబట్టి.. మండే స్వభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇది చాలా డేంజర్‌గా పరిగణిస్తుంటారు. ఇది పండ్ల వాసన వస్తోంది.

బిచ్చగాడిని హత్య చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: బిచ్చగాడిని హత్య చేసిన మరో బిచ్చగాడికి 10 ఏళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ నగరంలోని నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజులు సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ భరత్ అలీ ఖాన్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు దామర్‌సింగ్ గోపాలపట్నం రైల్వే స్టేషన్ పరిధిలోని ఒక బిచ్చగాడు. అతనికి మరో బిచ్చగానితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ రైల్వే స్టేషన్ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. దామర్ సింగ్ మరో వ్యక్తిని బలమైన ఇటుకతో గాయపరచడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును గోపాలపట్నం పోలీసులు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

3400 లీటర్ల వేస్ట్ ఆయిల్ స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో 3400 లీటర్ల వేస్ట్ ఆయిల్ కలిగి ఉన్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రౌతులపాలేనికి చెందిన సారిక పైడినాయుడు, అప్పలనాయుడు, సుంకర సూర్యనారాయణల వద్ద 17 డ్రమ్ముల్లో ఉన్న 3400 లీటర్ల వేస్టు ఆయిల్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.



విధుల్లో అప్రమత్తత అవసరం

ఆస్పత్రుల్లో రాత్రి సమయంలో విధులు నిర్వర్తించే వైద్యులు, ఇతర మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి. రాత్రి విధుల్లో వైద్యులు ఓ వార్డు నుంచి మరో వార్డుకు వెళుతున్న సమయంలో తప్పని సరిగా ఓ మహిళా ఉద్యోగిని తోడు తీసుకుని వెళ్లాలి. ఆ సమయంలో ఒక్కరే బయటకు రావద్దు. మహిళా వైద్యులు కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలి.

– డాక్టర్ ధవళ భాస్కరరావు, ఏఆర్ఎంవో, కేజీహెచ్





పటిష్ట భద్రత కల్పించాలి

ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందించడంలో నర్సులు కూడా కీలకపాత్ర వహిస్తారు. అలాంటి నర్సులకు ఎలాంటి రక్షణ గానీ, సదుపాయాలు గానీ లేవు. కనీసం వార్డుల్లో డ్రెస్సింగ్ రూమ్‌లు కూడా లేవు. మహిళా ఉద్యోగులకు అవసరమైన విశ్రాంతి గదులు, టాయిలెట్స్ ప్రత్యేకంగా ఉండాలి. ఆస్పత్రుల్లో రాత్రి సమయంలో నర్సులకు కొంత ఇబ్బందిగా ఉంటోంది. పోలీస్ వ్యవస్థతో పటిష్ట భద్రత కల్పించాలి.

– బి.భాగ్యలక్ష్మి, విశ్రాంత నర్సింగ్ సూపరింటెండెంట్

శతాధిక అథ్లెట్

- వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు కైవసం
- 101వ ఏట కూడా పతకాలు కొల్లగొట్టిన అథ్లెట్ శ్రీరాములు

విశాఖ స్పోర్ట్స్: శతాధిక వృద్ధుడు, అథ్లెట్ శ్రీరాములు తన 101వ ఏట కూడా పతకాలు కొల్లగొట్టి ఔరా అనిపించారు. స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో ఈ నెల 13 నుంచి 25 వరకు జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జావెలిన్, డిస్కస్, షాట్‌పుట్ అంశాల్లో ఆయన విజేతగా నిలిచారు. రక్షణ రంగంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం వల్ల ఇప్పటికీ ఆయన అద్భుతమైన ఫిట్‌నెస్‌ను కలిగి ఉన్నారు. అదే తన విజయ రహస్యమని శ్రీరాములు చెబుతారు. స్వీడన్ నుంచి మంగళవారం విశాఖ చేరుకున్న ఆయన్ని విమానాశ్రయంలో 'సాక్షి' పలకరించింది.

రోజూ 15 కిలోమీటర్లు నడుస్తాను

'వందేళ్లు దాటానంటే నాకే నమ్మకం లేదు. ఇప్పటికీ వెయిట్ ట్రైనింగ్ చేస్తాను. ప్రతి రోజూ 15 కిలోమీటర్లకు పైగా రేస్ వాక్ చేస్తాను. ఇదే నా దినచర్య. నేవీలో విశ్రాంతి ఉద్యోగిగా మారినప్పటి నుంచి అథ్లెటిక్స్‌లో పోటీ పడటం నాకు మరింత ఉత్సాహానిస్తోంది. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో భాగంగా త్రోస్ అంశాల్లో పోటీ పడి మూడింటిలో విజేతగా నిలవడం చాలా ఆనందంగా ఉంది' అని శ్రీరాములు తెలిపారు.

రాయల్ ఇండియన్ నేవీలో కెరీర్ మొదలు

'దేశానికి స్వాతంత్య్రం రాక ముందే 1944లో రాయల్ ఇండియన్ నేవీలో ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించాను. కరాచీలో శిక్షణ అనంతరం జపాన్ జలాంతర్గాములు, యుద్ధ నౌకల నుంచి విపరీతమైన బెదిరింపులు ఉండటంతో నౌకలకు ఎస్కార్ట్ చేయడం మా పనిగా మారింది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో కరాచీ, అండమాన్ దీవుల్లో పని చేసిన అనంతరం భారత నావికా దళంలో అధికారిగా చేరాను.' అని శ్రీరాములు తన కెరీర్ ప్రారంభాన్ని గుర్తు చేసుకున్నారు.

'నా స్వగృహం విశాఖలోనే ఉంది. ఈ జూలై 18న 101వ జన్మదిన వేడుకలు జరుపుకున్నాను. గతేడాది ఫిలిప్పీన్స్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. 2011లో జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లోనూ ఒక స్వర్ణంతో పాటు రెండు కాంస్య పతకాలను సాధించాను.' అని వివరించారు.

యుద్ధాల్లో పాల్గొన్నా..

'భారత నావికా దళంలో కమాండర్‌గా సేవలందించాను. 1962లో చైనా దురాక్రమణ, 1965, 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాలతో సహా పెద్ద యుద్ధాల్లో పాల్గొన్నాను. రెండో ప్రపంచ యుద్ధం నుంచి ఎర్రకోటపై భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం వరకు చూశాను' అని ఆయన తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



విశాఖ చేరుకున్న అథ్లెట్ శ్రీరాములు

క్రీడలంటే ఎంతో ఇష్టం

'కళాశాల రోజుల్లోనే ఫుట్‌బాల్ ఆడాను. అథ్లెటిక్స్‌లో మిడిల్ డిస్టెన్స్ పరుగుతో పాటు డిస్కస్, జావెలిన్ విసరడంలోనూ మంచి ప్రావీణ్యం సాధించాను. అయితే నావికా దళంలో మాత్రం యాచింగ్‌పై ఇష్టాన్ని పెంచుకుని సాయుధ దళాల తరఫున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. 81 ఏళ్ల వయసులో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాను. అయితే పదవీ విరమణ అనంతరం ఒకసారి గాయాలపాలయ్యాను. అథ్లెటిక్ అంశాల్లో నా మక్కువను కొనసాగిస్తున్నాను' అని శ్రీరాములు ముగించారు. వయసు అడ్డు కాదని.. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్న శ్రీరాములు జీవితం యువతకు ఆదర్శం.

విమ్స్ డైరెక్టర్ పోస్టుపై వివాదాస్పద వైద్యుడి కన్ను

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రితో చర్చలు?
- ఎంతైనా నగదు ముట్టజెప్పేందుకు సిద్ధమని సంకేతాలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) డైరెక్టర్ పోస్టు కోసం ఒక వైద్యుడు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీకాకుళానికి చెందిన మంత్రితో పైరవీలు మొదలుపెట్టారు. గతంలో ఆ వైద్యుడు విమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో పని చేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆర్థోపెడిక్ సమస్యలతో వెళ్లిన రోగులపై ఆయన నిర్లక్ష్యంగా ప్రవర్తించేవారనే అపవాదు కూడా ఉంది. చికిత్స చేసే సమయంలో రోగుల నుంచి డబ్బులు వసూలు చేసేవారని, తాను నిర్వహించే ప్రైవేట్ క్లినిక్‌కు వస్తే పూర్తిగా వ్యాధి నయం చేస్తానని చెప్పేవారని... ఇలా ఆయనపై అప్పట్లో విమ్స్ డైరెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదులు అందాయి. ఆరోపణలు రుజువు కావడంతో డిప్యూటేషన్‌పై వచ్చిన నెల్లూరుకే ఆయన్ని తిరిగి పంపించేశారు. ఆ తర్వాత బదిలీల్లో ఆయన కేజీహెచ్‌కు వచ్చారు. ఇప్పుడు ఆయన కన్ను ఏకంగా విమ్స్ డైరెక్టర్ కుర్చీపై పడింది. దీని కోసం ఇటీవల రాష్ట్ర మంత్రిని కలిసినట్లు తెలుస్తోంది. 'మీరెంత అంటే అంత... నాకు మాత్రం విమ్స్ డైరెక్టర్ పోస్టు ఇప్పించండి సార్' అంటూ మంత్రితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ క్రమంలో గతంలో ఆ వైద్యుడిపై వచ్చిన ఆరోపణలు కూడా మంత్రి దృష్టికి వచ్చాయి. గతం గతః.. ఇప్పుడా పోస్టులో ఆ వైద్యుడిని కూర్చోబెడితే భారీగా డబ్బులు వస్తాయన్న ఆలోచనలో మంత్రి ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే.. ఈ విషయం బయటకు పొక్కడంతో విమ్స్‌లో వైద్యులంతా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కేజీహెచ్‌లో పనిచేస్తున్న ఆ వైద్యుడు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన వ్యవహార శైలితోపాటు ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది.

శిశు విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

మర్రిపాలెం: శిశు విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని శిశు గృహ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల శిశువులను విక్రయిస్తున్న ముఠాను నగర పోలీసులు పట్టుకుని.. వారి నుంచి 9 మంది చిన్నారులను స్వాధీనం చేసుకుని శిశు గృహలో చేర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసలి అప్పారావు శిశు గృహను సందర్శించి.. పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్న పిల్లల విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, సచివాలయ సిబ్బంది, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ, విద్యా శాఖకు ఆదేశాలు చేస్తామన్నారు. శిశు కేంద్రాన్ని సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు తరచూ సందర్శించాలని సూచించారు. చట్టపరమైన దత్తతపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.వి.రమణకుమారి, శిశు గృహ మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ ఎస్.వి. రామలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న కేసలి అప్పారావు

సింహగిరిపై వేడుకగా శ్రీకృష్ణాష్టమి



హారతి ఇస్తున్న వేద పండితుడు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. ఆండాళ్లమ్మవారి ఉత్సవమూర్తిని దేవకీదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ జననోద్ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. బాలకృష్ణుడికి బేడా తిరువీధి నిర్వహించారు. ఆస్థానమండపంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారుల చెంతన బాలకృష్ణున్ని ఉంచి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వేదపండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని జరిపించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహించనున్నారు.

గోశాలలో కృష్ణాష్టమి పూజలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని విశేషంగా నిర్వహించారు. గోశాలలో ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద అర్చకులు పూజలు చేశారు. గోశాలలో ఉన్న గోవులకు పూజలు నిర్వహించారు.



గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఫిట్ ఇండియా పోటీలకు శ్రీకారం





అథ్లెట్ జ్యోతిని అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ విద్యార్థులు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞకు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం శ్రీకారం చుట్టారు. స్థానిక పాఠశాలలు, కళాశాలలతో పాటు రెసిడెన్షియల్ విద్యార్థులతో ఫిట్ ఇండియా కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, ది ఒలింపిక్ సంఘ విశాఖ శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల నుంచి వయోవృద్ధుల వరకు పరుగు, బ్యాడ్మింటన్‌తో పాటు, మహిళలకు ఫన్ యాక్టివిటీస్‌ను ఏయూ గ్రౌండ్‌లో ప్రారంభించింది. కార్యక్రమంలో డీఎస్‌డీవో గాలియట్, జిల్లా అమెచ్యూర్ అథ్లెటిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

అథ్లెట్ జ్యోతికి అభినందన

ఇటీవల ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్ పోటీలో పాల్గొన్న విశాఖ అథ్లెట్ జ్యోతిని కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అభినందించారు. అథ్లెట్ జ్యోతి కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

వీఎంఆర్‌డీఏ షాపులకు బహిరంగ వేలం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏకు చెందిన వాణిజ్య సదుపాయాలు, షాపులు, ఆడిటోరియాలు, ఆఫీస్‌లు, ఖాళీ స్థలాలకు నెలసరి/సంవత్సరం అద్దె ప్రతిపాదికపై ఇచ్చేందుకు టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వీటి అప్‌సెట్ ధర, ఇతర పూర్తి వివరాలు www.vmrda.gov.inలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ షాపులను మూడేళ్ల కాల పరిమితితో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో గానీ సంస్థ కార్యాలయం 8వ అంతస్తులో రెవెన్యూ విభాగంలో పొందవచ్చని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 28 నుంచి వచ్చే నెల 11 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో అందజేయాలని, బహిరంగ వేలం వచ్చే నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

72 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వేపోలీసులు అరెస్ట్ చేశారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, సిబ్బంది మంగళవారం పలు స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సోలాపూర్ జిల్లాకు చెందిన సచిన్ రాజారామ్ దికోలే, ఆకాశ లోకనాథ లోకారే, గంజాంకు చెందిన ఎం.సురేష్ మహరాణా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. 72 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ధనుంజయ నాయుడు తెలిపారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని క్లీనర్ మృతి

మల్కాపురం: తాను పని చేస్తున్న లారీయే అతని పాలిట మృత్యువైంది. లారీ ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్ మృతి చెందాడు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు వెల్లడించిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు గ్రామానికి చెందిన కింతాడ కృష్ణ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. శ్రావణ్ షిప్పింగ్ నుంచి లోడ్లు తీసుకువెళ్లే లారీలో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. డ్రైవర్, సబ్బవరం ప్రాంతానికి చెందిన సూరినాయుడుతో కలిసి సోమవారం లారీలో లోడు వేసుకుని, ఆర్‌సీఎల్ వద్ద లోడ్ అన్‌లోడ్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ లారీని వరస క్రమంలో పెట్టడానికి.. లారీ వెనుక నుంచి కృష్ణ డ్రైవర్‌కు సూచనలిస్తున్నాడు. అయితే.. డ్రైవర్ కృష్ణను గమనించలేదో లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించాడో తెలియదు గానీ.. లారీ వెనుక నుంచి కృష్ణను ఢీ కొట్టింది. వెనుక చక్రం కృష్ణ నడుం భాగంపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్యామలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాల తగ్గింపే ధ్యేయం

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ రామకృష్ణ ప్రసాద్



సీతమ్మధార: విద్యుత్ ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా పనిచేస్తామని ఈపీడీసీఎల్ విజిలెన్స్ విభాగం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కింజరాపు రామకృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గురుద్వారా వద్ద గల సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలను అన్ని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదాల జరగకుండా సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడినపుడు ముట్టుకోకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. విద్యుత్‌కి సంబంధించిన ఏ సమస్య ఉన్నా 1912కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినా ఈ నంబర్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వినాయక చవితి పందిళ్లకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు పెట్టడం నేరమని, తాత్కాలిక అనుమతితో కనెక్షన్లు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళం, ఏలూరు జిల్లాలకు కొత్తగా ఇన్‌స్పెక్టర్లను నియమించాల్సి ఉందన్నారు.

త్వరలో మరో 14 సూపర్ లగ్జరీ బస్సులు

తగరపువలస: జిల్లాలకు కేటాయించిన 34 సూపర్ లగ్జరీ బస్సులకు గానూ 20 బస్సులు వచ్చాయని.. త్వరలో మరో 14 బస్సులు రానున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మధురవాడ డిపో నుంచి ఒక్కొక్కటి రూ.42 లక్షల విలువైన 5 బస్సులను ప్రారంభించారు. వీటిలో హైదరాబాద్(భెల్‌కు)–2, భీమవరం, ప్రొద్దుటూరు, విజయవాడకు ఒక్కో బస్సు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు, కొత్త బస్ రూట్ల కోసం వచ్చిన వినతులపై అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ.అప్పలరాజు, డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు, మధురవాడ, విశాఖ, మద్దిలపాలెం డిపో మేనేజర్లు పాల్గొన్నారు.



మధురవాడ డిపోలో కొత్త సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

30న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. అమెజాన్ వేర్‌హౌస్, సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్, మెడ్‌ప్లస్ ఫార్మా, పేటీఎం, ఇన్నోస్ సోర్స్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 668 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. పికర్స్, సార్టర్స్, ఆపరేటర్ ట్రైనీ, రిలేషన్‌షిప్ మేనేజర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్, ఆఫీసర్ ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులు. 18 నుంచి 35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు.

1న సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గోపాలపట్నం: జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభూజీ, కార్యదర్శి నరసింహ నాయుడు తెలిపారు. గోపాలపట్నం ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సెప్టెంబర్ ఒకటో తేదీన ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలు మాత్రమే ఈ ఎంపికలో పాల్గొనాలని రైల్వే కోచ్ పి.రమణ సూచించారు.

ఆర్థిక సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: నగరంలో ఈ నెల 29న జరగనున్న ఆర్థిక సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం వివిధ విభాగాల అధికారులతో నోవాటెల్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి వివిధ రంగ నిపుణులు భాగస్వామ్యం అవుతున్నారని, అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందుల రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు.